# ఎన్టీఆర్ పేరెత్తకుండా అవార్డులా?

## నందుల ప్రదానంపై తెదేపా ఆక్షేపణ

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** నంది అవార్డుల ప్రదానోత్సవంలో కనీసం ఎన్టీఆర్ పేరు ప్రస్తావించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ ఇష్టపడలేదని తెదేపా ఆరోపించింది. మరోవైపు ఆ అవార్డుల కార్యక్రమానికి వచ్చిన సినీనటులు వైఎస్ మళ్లీ సీఎం కావాలని అన్నారంటూ, ఇప్పటికే నీళ్లు, నిధులు, గనులు, భూములు అన్నీ దోచేసిన వైఎస్.. ఇంకేం దోచేందుకు సీఎం కావాలని ప్రశ్నించింది. వైఎస్ మళ్లీ సీఎం అయినా ఇక దోచేందుకు ఏమీ లేదని పేర్కొంది. సోమవారం హైద్రాబాద్‌లో తెదేపా సీనియర్ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నన్నపనేని రాజకుమారి విలేకరులతో వేర్వేరుగా మాట్లాడారు. అన్నింటినీ కబ్జా చేసి, తినేసిన కాంగ్రెస్ పార్టీ చివరికి పార్టీ టిక్కెట్లు కూడా అమ్ముకుంటోందని విమర్శించారు. అలాంటి పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని, వైఎస్ సీఎం కావాలని కోరడంపై సినీనటులు ఆలోచించుకోవాలని రావుల సూచించారు. టిక్కెట్లు అమ్ముకున్నా గత ఎన్నికల్లో గెలవలేదా? అని డీఎస్ మాట్లాడడం దారుణమన్నారు. ఇప్పుడు కూడా వైఎస్, డీఎస్‌లే ఎన్నికల ముందు ఉన్నారని... "తిను-తినిపించు" అన్న సూత్రంతో వీరు పని చేస్తున్నారని విమర్శించారు.

నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ..."ఎన్టీఆర్ అవార్డు తీసుకున్న కృష్ణ కాని, మరో నటుడు మోహన్‌బాబు కానీ ఎవరూ ఆయన గురించి మాట్లాడలేదు" అని విమర్శించారు. ఎన్టీఆర్ అవార్డు ఇస్తున్నామన్న మాట కూడా చెప్పకుండా... ఆ మహానుభావుడి పేరును కూడా ఉచ్చరించకుండా ముఖ్యమంత్రి వైఎస్ దాటవేశారని ఆమె ఆక్షేపించారు. "ఎన్టీఆర్‌కు ఆతిథ్యం ఇవ్వలేక పోయాను... ఆయన అవార్డును తీసుకెళ్తున్నా అని సంతోషంగా చెప్పుకున్న పరభాషా నటుడు అంబరీష్‌ని చూసి మనవాళ్లు సిగ్గుపడాలి"అని వ్యాఖ్యానించారు. తెదేపా అధికారంలో ఉండగా ఏటా ఎన్టీఆర్ అవార్డులిచ్చామన్నారు. ఎన్నికల ఏడాది అయిన 2003లో మాత్రం ఇవ్వలేకపోయామని రాజకుమారి చెప్పారు. 2004లో అధికారానికొచ్చిన కాంగ్రెస్ నాలుగేళ్ల నుంచి ఈ అవార్డులివ్వకుండా రాజకీయం కోసమే ఇప్పుడిచ్చిందని ఆరోపించారు.